ప్రజాశక్తి
బుధవారం 2 ఏప్రిల్ 2025 5
శ్రీ సత్యసాయి

హంద్రీనీవా కాలువ గండిపడి పొలాల్లోకి వెళ్తున్న నీరు

పగ రగులుతోందా..?

- గ్రామాల్లో మొదలవుతున్న రాజకీయవేడి
- వచ్చేదంతా స్థానిక సంస్థల ఎన్నికల కాలం
- పోలీసులకు సవాల్‌గా శాంతిభద్రతల పరిరక్షణ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయంటే ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతాయి. సాధారణ ఎన్నికల కంటే కూడా ఈ ఎన్నికల్లోనే ఆధిపత్యపు పోరు ఎక్కువగా ఉంటుంది. ఆయా గ్రామాల్లో పట్టు కోసం రాజకీయ ప్రయత్నాలు ముమ్మరమవుతూ ఉంటాయి. తాజాగా జరిగిన మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నికలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి. పూర్తి స్థాయి మెజార్టీ వైసిపికున్నా.. అధికారపార్టీ తన వైపు మండల పరిషత్‌ను తిప్పుకునే ప్రయత్నాలు సాగాయి. దీన్ని అడ్డుకునేందుకు వైసిపి అదే స్థాయిలో ప్రయత్నాలు చేయడంతో రామగిరి మండల పరిషత్ ఎన్నిక ఉద్రిక్తతలకు దారి తీసింది. దీనికి కొనసాగింపుగానే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురబ లింగయ్య హత్యకు గురైనట్టు వైసిపి ఆరోపిస్తోంది. ఇక కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట ఎన్నిక కూడా వాడివేడిగానే మారిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఫిబ్రవరికి పంచాయతీల పదవీకాలం ముగియనుంది. ఆ తరువాత మార్చికి మున్సిపాల్టీల గడువు ముగినుంది. ఇక వచ్చే ఏడాది సెప్టంబర్ నాటికి ఎంపిటిసి, జడ్పిటిసిల పదవీకాలం ముగియనుంది. అంటే మరో ఆరు మాసాల నుంచి వరుసగా స్థానిక సంస్థల పదవీకాలాలు పూర్తవడం ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి ఈ ఎన్నికలు నిర్వహణ ప్రారంభమయ్యే అవకాశాలూ ఉన్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణకు సవాళ్లు తప్పవా. ?

స్థానిక సంస్థల ఎన్నికలంటేనే ఆధిపత్యపు పోరు ఉంటుంది. గ్రామాల్లో పట్టు కోసం ప్రయత్నాలు జోరుగా సాగుతాయి. ఈ నేపథ్యంలో ఫ్యాక్షన్ ఘర్షణలు చోటు చేసుకునే అవకాశాలుండనున్నాయి. వీటిని అరికట్టే విషయంలో పోలీసులు ఏ మేరకు సఫలీకృతమవుతారన్నది చూడాల్సి ఉంటుంది. ఇప్పుడు మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల విషయంలో రామగిరిలో జరిగిన ఒక్క దానికే పూర్తి స్థాయిలో నియంత్రణ చేపట్టలేకపోయారన్న విమర్శలున్నాయి. అంతేకాకుండా ఒక హత్య కూడా జరగడం గమనార్హం. ఇక ఎన్నికలు జరిగితే అనేక ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు జరిగే అవకాశాలు లేకపోలేదని విపక్షాలు చెబుతున్నాయి. గతంలో చూసుకున్నా స్థానిక సంస్థల ఎన్నికలు కొన్ని నియోజకవర్గాల్లో అత్యంత సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలున్నాయి. ప్రధానంగా రాప్తాడు, ధర్మవరం, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో గతం నుంచి ఫ్యాక్షన్ ప్రభావమున్న గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఏ రకమైన ముందస్తు చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. ఈ ప్రాంతాలు పోలీసులకు ఒక సవాల్‌గానే మారే అవకాశముంది. ఇప్పటికే తాడిపత్రి, రాప్తాడు నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య పరస్పరం ఘర్షణ వాతావరణమే నెలకుని ఉంది. అధికారపార్టీకి పూర్తి స్థాయిలో అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ ఈ రెండుచోట్ల వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు కూడా కొంత మంది అధికారులపై ఫిర్యాదులు చేసిన ఘటనలూ ఉన్నాయి. ఇవి ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్ది మరింతగా పెరిగే అవకాశాలూ లేకపోలేదని విశ్లేషకులు చెబుతున్నారు.

హంద్రీనీవా కాలువకు గండి

వరి పొలాల్లోకి వెళ్లిన నీరు

ప్రజాశక్తి-సోమందేపల్లి

హంద్రీనీవా కాలువ నుంచి వచ్చిన నీటితో మునిగిపోయిన వరిమడి

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి పెద్దచెరువు సమీపంలోని కంకర ఫ్యాక్టరీ వద్ద హంద్రీనీవా కాలువకు మంగళవారం రాత్రి గండిపడి పడింది. దీంతో నీళ్లన్నీ సమీప పొలాల్లోకి వెళ్లాయి. విషయం తెలుసుకున్న హంద్రీనీవా అధికారులు మంగళవారం ఉదయం గండిపడిన కాలువను సందర్శించారు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేసి నీరు బయటకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. కాగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురానికి వెళ్తున్న హంద్రీనీవా కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో తరచూ ఎదో ఒక చోట గండిపడి నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. కాగా సోమవారం రాత్రి గండిపడి నీళ్లన్నీ సమీప వరి పొలాల్లోకి వెళ్లాయి. దీంతో నీటి ప్రవాహానికి వరిపొలాలు వంగిపోయాయి. ఇలా తరచూ హంద్రీనీవా కాలువ సమీపంలో నీళ్లు బయటకు వచ్చి పంటలను నష్టపోతున్నామని, దీనిపై అధికారులు స్పందించి శాశ్వత చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గండిని పూడ్చండి:మంత్రి సవిత

పెనుకొండ : సోమందేపల్లిలో గండిపడిన హంద్రీనీవా కాలువను వెంటనే పూడ్చాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె కలెక్టర్, నీటిపారుదల శాఖాధికారులతో మాట్లాడారు. కాలువ తెగడంతో నీరు రైతుల పొలాల్లోకి వస్తున్న నేపథ్యంలో అడ్డుకట్ట వేయాలని సూచించారు.

ముగిసిన పదవ తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లావ్యాప్తంగా పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 17న ప్రారంభం అయిన పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగాయి. చివరి రోజు జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షలకు జిల్లావ్యాప్తంగా రెగ్యులర్ 21,403 మంది గాను 21,184 మంది హాజరయ్యారయ్యారని డిఇఒ కిష్టప్ప తెలిపారు. 219 మంది గైర్హాజరయ్యారన్నారు. ప్రయివేటు విద్యార్థులు 85 మందికి గాను 64 మంది హాజరుకాగా 21 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పది పరీక్షల విజయవంతంలో సంబంధిత అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేశారని డిఇఒ తెలిపారు.

కదిరి వైసిపికి గడ్డుకాలం..!

2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత కదిరి వైసిపికి గడ్డుకాలం నడుస్తోంది. నడిపించే నాయకుడు లేక ఆ పార్టీ క్యాడర్ నిస్తేజంలోకి వెళ్లింది. సొంత పార్టీలోనే అసమ్మతి రాగం విన్పిస్తోంది. ఇందులో భాగంగానే మంగళవారం నాడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ తన పదవికి రాజీనామా చేశారు. ఇక ఛైర్‌పర్సన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

- సొంత పార్టీలోనే అసమ్మతి గళం
- మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజీనామా
- ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం..?
- టిడిపి వైపు చూస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలో వైసిపి 2019 సార్వత్రిక ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటింది. 2024 ఎన్నికల ముందు అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డిని పక్కనబెట్టి రాజకీయాలతో సంబంధం లేని కొత్త వ్యక్తి మక్బూల్ అహమ్మద్‌ను వైసిపి పోటీలో నిలిపింది. అప్పట్లో ఈయన అభ్యర్థిత్వాన్ని చాలా మంది వైసిపి నాయకులు వ్యతిరేకించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండదండలతో మగ్బుల్ బాషా పోటీలో నిలిచి ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం మగ్బుల్ కన్పించకుండా పోయారు. దీంతో కదిరి వైసిపిని నడిపించే నాయకుడు లేక ఆ పార్టీలో నైరాస్యం కన్పిస్తోంది.

ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం..?

కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నిసాపై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు వైసీపీకి చెందిన కౌన్సర్లే సిద్ధమైనట్లు తెలుస్తోంది. గడిచిన పురపాలక సంఘం ఎన్నికల్లో కదిరి పట్టణంలో 36 వార్డు ఉండగా 31 వార్డుల్లో వైసిపి కౌన్సిలర్లు విజయం సాధించారు. అప్పటి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అండతో రెండున్నర సంవత్సరం కాల పరిమితితో పరికి నజీమున్నిసాకు అవకాశం ఇచ్చారు. ఒప్పందం మేరకు రెండున్నర సంవత్సరాలు పూర్తయినా ఛైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చేయలేదు. ఛైర్‌పర్సన్ రాజీనామా చేయాలని కోరుతూ గతంలోనే కొందరు కౌన్సిలర్లు బహిరంగంగా డిమాండ్ చేశారు. స్పందించిన అధిష్టానం అసమ్మతి కౌన్సిలర్లతో మాట్లాడి బుజ్జగించారు. 2024 ఎన్నికల్లో టిడిపి విజయం తర్వాత మున్సిపాల్టీలో పరిస్థితి పూర్తిగా మారింది. వైసిపికి ముఖ్యనాయకుడు ఎవరూ లేకపోవడంతో ఆ పార్టీ కౌన్సిలర్లే స్తబ్ధుగా ఉన్నారు.

వైసిపి కౌన్సిలర్ల పక్కచూపులు..!

ప్రస్తుతం ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. కొందరు అధికార పార్టీలో చేరేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకుని, ఎమ్మెల్యే కందికుంట గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందే వైసిపికి చెందిన కొందరు కౌన్సిలర్లు చంద్రబాబు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం కదిరి మున్సిపాల్టీలో టిడిపికి 11 మంది ఉండగా, వైసిపికి 25 మంది ఉన్నారు. వైసీపీకే చెందిన మెజార్టీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుర్చీకి ఎసరు పొంచిఉందన్న రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

వైస్ ఛైర్‌పర్సన్ రాజీనామా

కదిరి వైసిపిలో రోజుకో పరిణామం చోటు చేసుకుంటోంది. ముఖ్యంగా మున్సిపాల్టీలో నాయకులు ఎవరికి వారే అన్నరీతిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాడు వైస్ ఛైర్‌పర్సన్ గంగాదేవి తన పదవికి రాజీనామా చేశారు. పార్టీలో నెలకొన్న అంతర్గత విబేధాల కారణంగానే ఆమె రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఇతర కౌన్సిలర్లు కూడా పక్కచూపులు చూస్తున్నట్లు సమాచారం.

రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు అందిస్తున్న వైస్ ఛైర్‌పర్సన్ గంగాదేవి

ఫారంపాండ్లతో సాగుభూమి సారవంతం

జిల్లా ప్రత్యేక అధికారి హరి నారాయణ

ప్రజాశక్తి-పెనుకొండ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న పారంపాండ్స్ సాగుభూమిని మరింత సారవంతం చేస్తాయని జిల్లా ప్రత్యేక అధికారి హరి నారాయణ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన పెనుకొండ రూరల్ పరిధిలోని రాంపురం గ్రామ పంచాయతీ పరిధిలో పర్యటించారు. గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, డ్వామా ఏపీ పీడీతో కలిసి పరిశీలించారు. పశువుల నీటితొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మినీ గోకులాలను పరిశీలించి, లబ్దిదారులతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న ఫారం పాండ్స్‌ను తనిఖీ చేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సాగుభూమిని సారవంతం చేయడం లోనూ, ప్రతి ఏటా రైతులు బహుళ పంటల సాగు చేయడంలో ఫారంపాండ్స్ సహాయ పడతాయని పేర్కొన్నారు. రైతులు ఎందరు ఫారంపాండ్స్‌ను కోరినా వారికి అధికారులు మంజూరు చేస్తారని తెలిపారు. అనంతరం మహిళా రైతు అరుణ నిర్మించుకున్న గోకులం షెడ్డు పరిశీలించారు. పశువులు తాగునీటి తొట్టెల నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్, పీడీ నర్సయ్య, సెరికల్చర్ జెడి పద్మావతితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫారంపాండ్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ

దోచుకున్న ప్రతి రూపాయిని కక్కిస్తాం : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులు ఎక్కడ దాకున్నా బయటకు తీసుకొస్తామని, వారు దోచుకున్న ప్రతి రూపాయిని స్వాధీనం చేసుకుని, ప్రజలకిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. పట్టణంలోని గడంగ్ వీధి, కుమ్మరిదొడ్డి కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంత్రి సవిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పు చేయనప్పుడు భయమెందుకని, తమ ప్రభుత్వం ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడబోదని తెలిపారు. జగన్ ఓ టూరిస్ట్ అని, అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చి వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం చంద్రబాబునాయుడు అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఉధతంగా చేపడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు.

పెనుకొండ రూపరేఖలు మారుస్తున్నాం : అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే పెనుకొండ పట్టణం రూపు రేఖలు మార్చినట్లు మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుతం పెనుకొండ పట్టణంలోనే రూ.5 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పట్టణంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు పూర్తి చేశామని, త్వరలో కోనాపురం, ఇస్లాపురం రోడ్లను కూడా నిర్మించబోతున్నామని వెల్లడించారు.ప్రస్తుత వేసవిని దష్టిలో పెట్టుకుని పశువుల సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. ఇప్పటికే నియోజక వర్గ వ్యాప్తం గోకులం షెడ్ల నిర్మాణాలు ప్రారంభించామన్నారు. దీంతో పాటు పశువులకు నీటి ఎద్దడి రాకుండా ఉండడానికి తాగునీటి తొట్టెలు కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి పింఛను అందజేస్తున్న మంత్రి సవిత

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

నిరసన ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా వున్న మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ధర్మవరం సిఐటియు కార్యాలయం నుంచి కళాజ్యోతి సర్కిల్, కాలేజీ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జే వి రమణ ,కో కన్వీనర్ టి అయుబ్ ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికులకు రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేస్తామని హామీలిచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన పది నెలలైనా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులను నట్టేట ముంచే విధంగా ఆప్కాస్ పద్ధతిని రద్దుచేసి కాంట్రాక్ట్ పద్ధతిని మరల అమలు చేయాలని ప్రతిపాదనలు కూటమి ప్రభుత్వం రూపొందిస్తోందని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గమైన ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని హితవు పలికారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం కార్మికులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టినందుకు అధికారాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు.కార్మికులకు నష్టం కలిగించే విధానాలను తీసుకువస్తే రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులను కలుపుకొని పోరాటాలను సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ హైదర్‌వలి, మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎం బాబు, ముకుంద, కోశాధికారి లక్ష్మీ ఓబులేసు, కార్మికులు ,ఇంజనీరింగ్ కార్మిక జిల్లా అధ్యక్షులు బొగ్గు నాగరాజు ,పట్టణ కమిటీ అనిల్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 93.31 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో మంగళవారం 93.31 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం పింఛనుదారులు 2,62,702 మంది ఉన్నారన్నారు. మంగళవారం మొదటి రోజు రూ. 2,79,6000 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిపోయిన వారికి బుధవారం పంపిణీ చేస్తామన్నారు. కాగా పింఛన్ల పంపిణీలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పాల్గొనగా నల్లమాడలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ హై స్కూల్ మైదానంలో ఈ నెల 6 నుంచి 9 వతేదీ జరగనున్న 15వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర ఛాంపియన్ షిప్ పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, శ్రీ సత్యసాయి జిల్లా జనరల్ సెక్రెటరీ బి. సూర్య ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ. దివంగత వ్యాయామ ఉపాధ్యాయులు ఊకా అశ్వర్థ నారాయణ జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ను హాకీ ఆంధ్ర ప్రదేశ్ సౌజన్యంతో, హాకీ శ్రీ సత్య సాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 22 జట్లు పాల్గొంటాయన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారని వెల్లడించారు.

క్రీడాకారుడితో అసోసియేషన్ సభ్యులు

జాతీయ స్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారుడు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

చిత్తూరులో మంగళవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు జాతీయ స్థాయిలో జరిగే ఆంధ్రప్రదేశ్ యూత్ బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టు క్యాంపునకు ధర్మవరం పట్టణానికి చెందిన కార్తీక్ నాయక్ అనే క్రీడాకారుడు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రా రెడ్డి తెలిపారు. కార్తీక్‌నాయక్ ఫిబ్రవరి 8వ తేదీ నుండి 11 వరకు కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగినలో ఉమ్మడి బాలుర బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు తరపున పాల్గొని తన ప్రతిభతో ఎంపికయ్యాడని ధర్మాంభ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, కోచ్ సంజయ్, గవర్నమెంట్ హై స్కూల్ పిడి నాగేంద్ర చెప్పారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ 2025 కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులందరికి ఏప్రిల్ 2 వ తేదీ నుండి పాలిసెట్ కొరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇచ్చే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందూపురం :పాలీసెట్-2025 కు దరఖాస్తు చేసుకున్న 10వ తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు 10వ తరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పాలీసెట్ -2025 నందు అర్హత సాధించేందుకు వీలుగా ఏప్రిల్ 3వ తేదీ నుండి ఏప్రిల్ 28వ తేదీ వరకు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి -గాండ్లపెంట

మండలంలోని మార్చి 17 నుంచి ప్రారంభించిన పది పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా పరీక్షకేంద్రం డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, దామోదర నాయుడు, రామంజులు, యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు.

నంబులపూలకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. మంగళవారం ఆఖరి పరీక్ష రోజున ఫ్లైయింగ్ స్వాడ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డి పల్లిలో చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో మునిసిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చౌడేశ్వరి ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ లడ్డు, అధ్యక్షులు నాగరాజు, కౌన్సిలర్లు మహాలక్ష్మి, భారతి, టీడీపి నాయకులు పామిశెట్టి శేఖర్, నాగేంద్ర హరీష్, వెంకటస్వామి, పల్లా కుమార్, డిసి రఘునాథ్, మంచాల మారుతి, పల్లా చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : చౌడేశ్వరి పంచమజ్యోతుల ఉత్సవాలు అంబరాన్నంటాయి. మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు దేవాలయం వద్ద ప్రత్యేకపూజల అనంతరం ఉత్సవ విగ్రహానికి ఆలయ కమిటీ అధ్యక్షులు డీసీ ఈశ్వరయ్య చేతుల మీదుగా పూజలు నిర్వహించి ఊరేగింపుగా బయలు దేరారు. ఆంజనేయస్వామి దేవాలయం, మెయిన్ బజార్, పాత సినిమా టెంట్, డీఎల్ రోడ్, మార్కెట్ రోడ్ మీదుగా జ్యోతులను ప్రదర్శించారు. తోగటవీర క్షత్రియ మండల అధ్యక్షులు సిసి హరిదాస్ ఆహ్వానం మేరకు మంత్రి సవితమ్మ జ్యోతుల ఉత్సవానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జ్యోతి సేవా సంఘం సభ్యులు, నాయకులు డిసి నారాయణస్వామి, జడ్పీటీసీ డీసి అశోక్ కుమార్, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య, రంగన గోపాల్, గట్టా మహీంద్ర, ఎగువింటి రామాంజినేయులు, డీవి ఆంజనేయులు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 1362 నీటితొట్టెల నిర్మాణం : కలెక్టర్

నీటితొట్టె నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా 1362 నీటి తొట్టెల నిర్మాణాలను చేపడుతున్నట్లు కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కప్పల బండ గ్రామంలో పశువుల తాగునీటి తొట్టి నిర్మాణానికి ఆయన మంగళవారం భూమి పూజ చేశారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని మూగజీవాలకు దాహార్తి నీ తీర్చడానికి వీటి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి గ్రామస్తులంతా సహకరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నీటితొట్టెల నిర్మాణ నులను 15 రోజులు లోపు పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులకు తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా 1362 నీటి తొట్టిలను మంజూరు చేశారని వాటిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ విజయేంద్ర ప్రసాద్, వెటర్నరీ ఏడి సుభదాస్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అగళి : మండలంలోని 12 పంచాయతీల్లో నీటితొట్టెల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమార్ స్వామి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, కృష్ణారెడ్డి, బుజ్జి చోడయ్య తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని కట్టారుపల్లి పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువులు తాగునీటి తొట్టెలు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. మండల వ్యాప్తంగా దాదాపు 55 తొట్టెలు మంజూరయ్యాయని ఒక్కొక్క తొట్టికి 34 వేల రూపాయలు మంజూరయ్యాయని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎపిఒ మంజునాథ్, ఇసి సుబ్బారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అక్బర్‌బాషా, ఫీల్డ్ అసిస్టెంట్ రైతులు పాల్గొన్నారు

మడకశిర : రొల్ల మండల కేంద్రంలో నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోబీసీ సాధికారిక కుంచిటి ఒక్కలిగా రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ బి ఎస్ గురుమూర్తి, మండల కార్యదర్శి జికె ఈరన్న, క్లస్టర్ ఇంచార్జ్ భరత్, యువ నాయకుడు ఆనంద్, ఉపాధి హామీ పథకం జేఈ మారేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కే బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణపల్లి సమీపాన ఉన్న కుమ్మరవాండ్లపల్లిలో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు ఈసందర్భంగా కందికుంట మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో ముందుకు నడుస్తోందన్నారు. పింఛన్ల కార్యక్రమాలలో బాణసంచాలు పూలదండలు హంగామాలు చేయకూడదని, నియోజకవర్గ ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని సత్వరమే పరిష్కరించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులను, కూటమి నాయకులకు కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో అవినీతి తప్పితే అభివృద్ధి చేసింది లేదని విమర్శించారు.కనీసం గుంతలు పడిన రోడ్లకు తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోలప్ప, ఆయా శాఖల అధికారులు, టిడిపి మండల కన్వీనర్ చెన్నకేశవులు నాగేంద్రప్రసాద్ రామచంద్ర, వెంకటేష్ స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పెన్షన్ లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మడకశిర: నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువులకు తాగునీటి కోసం నిర్మిస్తున్న నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సోనియా భాయ్, మద్దనకుంటప్ప, ఆసుపత్రి కమిటీ మెంబర్ కృష్ణమూర్తి, కాసిం సాబ్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

డిఎస్‌ఒతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గం వ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలోని రహదారులు విశ్రాంతి భవనంలో మంగళవారం డిఎస్ఒ వంశీకృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గత ఆగస్టు నెల నుంచి కి రిజిస్టర్ ప్రకారం రేషన్ పంపిణీ చేయడం జరుగుతూ ఉండేదన్నారు. అయితే ఏప్రిల్ నెలకి సంబంధించి జనవరి ఫిబ్రవరి మార్చి మూడు నెలలు వేసిన బియ్యాన్ని యావరేజ్ చేసి ఆర్వో ఇచ్చారన్నారు. అందుకు గాను ప్రతి డీలర్‌కు బియ్యం తక్కువగా వస్తున్నాయని దీంతో వారు లబ్ధిదారులకు బియ్యం పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోతున్నారని వివరించారు. ఈ విషయంపై స్పందించిన డీఎస్ఒ వెంటనే చర్యలు తీసుకుంటామని సమస్య పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్, కుమారస్వామి, మదన గుండప్ప, దాసిరెడ్డి, తహశ్శిల్దార్లు కరుణాకర్, షేక్షావలి, లక్ష్మీ నరసింహ, జడ్పిటిసిఉమేష్ , స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ : ఆర్థిక ఇబ్బందులతో కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడిన పట్టణంలోని గాంధీ బజారుకు చెందిన కృష్ణమాచారి బంధువులను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్న వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని తల్లిదండ్రులు, తమ్ముళ్లతో మాట్లాడారు. కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్ లక్ష్మీనారాయణ కౌన్సిలర్ ఉమా శంకర్, జడ్పిటిసి సభ్యులు, కన్వీనర్లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునీకరణకు చర్యలు

రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునీకరణకు మరిన్ని చర్యలు చేపడతామని గుంతకల్ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ విల్సన్ బాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ధర్మవరం రైల్వే స్టేషన్ స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైల్వే నిర్మాణ పనులను పరిశీలించారు. ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునీకరణ కోసం కేటాయించిన రూ. 7.50 కోట్లకు గాను పేస్-1 కింద రూ.3.50 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. రైల్వే స్టేషన్ లో జి ఆర్ పి ఆర్ పి ఎఫ్ భవనాలు చాలా పాతవి కావడంతో వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించడానికి నిధులు కూడా మంజూరు అయ్యాయని చెప్పారు. త్వరలోనే టెండర్లను పిలిచి నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. రైల్వే ఆసుపత్రి నిర్మించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గుడ్‌సెట్ కొట్టాల వైపు నుంచి వచ్చే ప్రయాణికుల కోసం బుకింగ్ కౌంటర్ ను ఏర్పాటు చేయడం కూడా జరుగుతుందని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం కోసం అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు కమర్షియల్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, సీనియర్ సెక్షన్ సివిల్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, కమర్షియల్ ఇన్స్పెక్టర్ బాబూజీ రావు, ధర్మవరం స్టేషన్ వినియోగదారుల సలహా కమిటీ సభ్యుడు కాశీ విశ్వనాథ్, వంకదారి నాగరాజు, కోటి వెంకటేశులు, భీమనేని ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని ఓరువాయి పంచాయతీలో నిర్వహించిన ఎల్లమ్మ స్వామి తిరుణాల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి ముదిగుబ్బ

లైనింగ్ పనుల వద్ద రైతుసంఘం నాయకులు

హంద్రీనీవా కాలువకు చేపడుతున్న లైనింగ్ పనులను వెంటనే ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం నాయకులు, రైతుసంఘం నాయకులు మంగళవారం మండలంలోని మల్లమ్మ కొట్టాల సమీపంలో హంద్రీనీవా కాలువలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లైనింగ్ పనులు కాకుండా హంద్రీనీవా కాలువలను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. లైనింగ్ పనులు చేయడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతారని భూగర్భ జలాలు అడుగంటిపతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువను వెడల్పు చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న చెరువులన్నిటికీ నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని యోగివేమన రిజర్వాయర్‌కు నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ధర్మవరం మారుతి, సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, పోతలయ్య, పకీరప్ప, సుధాకర, సుధాకర్ రెడ్డి, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయిలో పాంచజన్య విద్యార్థికి ప్రథమ ర్యాంకు

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయుల శ్రమ, విద్యార్థుల కఠోర దీక్ష, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాలకు మంచి గుర్తింపు లభించిందని ఆ పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. ఇటీవల నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలియాన్స్ ఇండియా (ఎన్ ఐఎస్ఎ) జాతీయస్థాయిలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఎన్ఎటి -2024 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థి అలీషా అంజూం జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఈ విషయంపై మంగళవారం పాఠశాలలో పాఠశాల యాజమాన్యం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించింది. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, సెక్రటరీ నందకుమార్ మాట్లాడుతు నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలియాన్స్ ఇండియా వారు జాతీయస్థాయిలో ఎన్ఎటి - 2024 పరీక్షలను నిర్వహించారన్నారు. ఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో లక్షలాది మంది ఆయా తరగతుల వారిగా పోటీపడ్డారని తెలిపారు. ఇందులో పాంచజన్య పాఠశాల తరపున 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు దాదాపు 500 విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పరీక్షలు విమర్శనాత్మక ఆలోచన, సజనాత్మక ఆలోచన, తార్కిక తార్కికం, సమస్య పరిష్కారం, బహుళ మేధస్సు అంశాలపై నిర్వహించారని చెప్పారు. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థుల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని వివరించారు. ఇందులో 3వ తరగతిలో జాతీయ స్థాయిలో అలీషా అంజూం మొదటి స్థానం సాధించిందన్నారు. దీంతో పాటు రాష్ట్ర స్థాయిలో

వివరాలను వెల్లడిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

సైతం ప్రథమ, ద్వీయ, తృతీయ స్థానాలతో పాటు మరో 20 మంది విద్యార్థులు వివిధ ర్యాంకులను సాధించారని వివరించారు. గత సంవత్సరం సైతం జాతీయ స్థాయిలో 4వ తరగతి విద్యార్థి ముస్తఫా ప్రథమ స్థానం, రిధా ఫాతీమా ద్వితీయ స్థానాలను కైవశం చేసుకుని డిల్లీ, యూకే లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో బహుమతులు అందుకున్నారని తెలిపారు. పాఠశాలలో చదువుతో పాటు అన్ని పోటీ పరీక్షలకు సంబంధించి ఉపాధ్యాయులు ప్రత్యేక

ప్రతిభా విద్యార్థి అలీసా

శిక్షణ ఇవ్వడంతోనే తమ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారని అన్నారు. ఈ విజయాలకు ప్రధాన కారణం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయు లేనని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి అలీసా అంజూంను శ్రీనివాసులుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్ఎం గాయత్రి, ఏఒ భాస్కర్, సూపరిటెండెంట్ విజయేంద్ర, ఏ హెచ్ ఎం లు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తో పాటు ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని తల్లి దండ్రులు అఫ్రోజ్ బాను, ఇనాయత్ భాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - పావగడ

కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో యువకుడు మతి చెందిన సంఘటన తాలూకాలోని వైఎన్ హొసకోట హొబలి జోడి అచ్చమ్మనహళ్లి గ్రామానికి సమీపంలో చోటుచేసుకుంది. తాలూకాలోని ఎర్రమ్మనహళ్లి గ్రామానికి చెందిన దర్శన్ (20) తన స్నేహితులతో కలిసి అమ్మమ్మ ఊరు బెస్తరహళ్లికి కారులో వెళుతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దర్శన్‌ను తదుపరి చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దర్శన్ మృతిచెందినట్లు అతని కుటుంబసభ్యులు తెలిపారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని గోవిందాపురం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహివర్ధన్ రెడ్డి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.కదిరి నియోజకవర్గం ఒడిసి గ్రామానికి చెందిన మహి వర్ధన్ రెడ్డి కర్నాటక ప్రాంతం చిక్కమగళూరులో ఫిజియోథెరపీ నాలుగవ సంవత్సరం చదువుతున్నారు. ఒడిసి నుండి చిక్క మంగళూరు వెళుతున్న సందర్భంగా మంగళవారం ప్రమాదానికి గురయ్యారు. వెంటనే గ్రామస్తుడు మహేష్ క్షతగాత్రుడిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ అనిల్ కుమార్ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. క్షతగాత్రుడిని యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, మండల అధ్యక్షులు మహాలింగప్ప, మహేష్, మాజీ కోఆప్షన్ నెంబర్ మంజునాథ్, తదితరులు పరామర్శించారు.

హత్య కేసు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ పరిధిలోని రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో మార్చి 30వ తేదీ జరిగిన ఘర్షణలో జరిగిన మజ్జిగ లింగన్న మృతి చెందిన కేసును రామగిరి పోలీసులు ఒక్క రోజులోనే ఛేధించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హేమంత్ కుమార్ మంగళవారం ధర్మవరం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను వెల్లడించారు. మార్చి 30వ తేదీన జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన మజ్జిగ లింగన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. నిందితులు ధర్మవరపు ఆదర్శ్, ధర్మవరపు మనోజ్‌ను మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో రామగిరి గ్రామ శివారులో అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామగిరి సిఐ శ్రీధర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మద్యం మత్తు ఓ నిండు ప్రాణాన్ని బలికొంది. మండల కేంద్రంలోని సాయి నగర్ లో నివాసం ఉటున్న నారాయణ, అతని బావమరిది మారెప్ప మద్యం మత్తులో మంగళవారం గొడవ పడ్డారు. మద్యం మత్తులో నారాయణ(25)కు బలమైన దెబ్బ తగలడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. వీరు రెండు రోజులుగా గొడవ పడుతున్నారని స్థానికులు తెలియజేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెనుకొండ సిఐ రాఘవన్, స్థానిక ఎఎస్ఐ మురళి తెలిపారు. పోలీసులతో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ద్విచక్ర వాహనం బోల్తా

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని మూలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మూలపల్లికి చెందిన పెద్ద రమణయ్య (56) బత్రేపల్లి నుంచి తన స్వగ్రామం మూలపల్లి గ్రామానికి దిచక్రవాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలో రోడ్డుపై వెళ్తున్న మహిళను తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమణయ్యను బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

శ్రీరామ నవమి వేడుకలకు ఎస్పీకి ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని కరావులపల్లి గ్రామ సమీపంలో గల శివుడు,ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు రావాలని జిల్లా ఎస్పీ రత్నను దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం పుట్టపర్తి లోని ఎస్పీ నివాసం వద్ద ఆమెను కలిసి ఆహ్వానించారు. ఈనెల ఆరవ తేదీన గ్రామంలో శివుడు, ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సీతారాముల కళ్యాణోత్సవం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తున్నామని గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సునీత శంకర్ లాల్ నాయక్, గోరంట్ల జడ్పిటిసి పాలే జయ రామ్ నాయక్, పుట్టగుండ్లపల్లి వెంకట శివారెడ్డి, ఎర్రామ్జీ శ్రీనివాస్ నాయక్, రాజేష్ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ ఏడి శ్రీరాములు నాయక్, రామస్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మహిళలకు, బాలికలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో శక్తి ఎస్ఓఎస్ యాప్ ఎలా వినియోగించుకోవాలని, తెలియజేశారు. ఈ యాప్ మహిళల భద్రత కోసమే ప్రత్యేకంగా రూపొందించిందని తెలిపారు ఈ సందర్భంగా మహిళా పిఎస్ డిఎస్పీ ఆదినారాయణ ,పర్యవేక్షణలో శక్తి బృందాలు బస్టాండు, రైల్వేస్టేషన్, మార్కెట్ ప్రధాన కూడలిలో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.

3న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో ఈ నెల 3వ తేదీన 35 సంవత్సరాలకు పైబడిన మహిళలకు ఉచిత క్యాన్సర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి పూర్వపు విద్యార్థులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు నడిపించే పాలియోటివ్ కేర్ సెంటర్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి నెల మొదటి గురువారం క్యాంపు ద్వారా చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో సుమారు 750 మంది క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారికి సేవలందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో స్కానింగ్ కోసం నమోదు చేసుకునేవారు 08047103700 కు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు. శ్రీ సాయి పాలియోటివ్ కేర్ సెంటర్ పట్టణంలోని సాయి నగర్ ఎస్ ఎస్ ఎస్ ఎదురుగా సత్యసాయి అనుగ్రహ గృహం వద్ధాశ్రమం వెనుక భాగంలో ఉంటుందని తెలిపారు.

స్థలం ఇప్పించండి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని రాగన్నగారి పల్లి గ్రామంలోని ముస్లింల ఖబరస్తాన్ ఆక్రమణకు గురైందని ఈస్థలం ముస్లిములకు ఇప్పించాలని ముస్లింసోదరులు కోరారు. ఈసందర్భగా వారు మాట్లాడుతూ 300 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన పూర్వీకులు ముస్లింల ఖబరస్థాన్ కోసం ఈ భూమిని దానంగా ఇచ్చారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు రాగన్నగారి పల్లి ముస్లింలు చనిపోతే ఈ ఖభరస్తాన్‌లోనే ఖననం చేసేవారన్నారు. అయితే ఇప్పుడు కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలసి గ్రామంలో కొంతమంది ఈ భూమి యజమాని వారసులమని ఆక్రమణ చేసుకుంటున్నారన్నారు. ఈ భూమికి సంబంధించిన రిజిస్టర్ చేసుకున్న పత్రాలు కూడా ఉన్నాయని వీటిని అధికారులకు చూపించి హద్దులు ఏర్పరచుకుంటే వాటిని కూడా ధ్వంసం చేశారని వాపోయారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని రంజాన్ రోజున ముస్లిములు ఖబరస్థాన్ వద్ద ఆందోళన చేశారు.

కబ్జా స్థలం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిములు